యుపిఎస్‌సి ఆశావహులకు విజన్ ఐఎఎస్ సెమినార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యుపిఎస్‌సి ఆశావాహులకు విజన్ ఐఎఎస్ అకాడమీ ప్రత్యేక సెమినార్‌ను నిర్వహించినట్లు తెలిపింది. యుపిఎస్‌సిలో విజయవంతమైన వారితో వ్యూహాలను పంచుకోవడానికి ఒకచోట చేర్చినట్లు పేర్కొంది. యుపిఎస్‌సి సివిల్ సర్వీసెస్ పరీక్ష 2024లో ఆకట్టుకునే రీతిలో ఆల్ ఇండియా ర్యాంక్ (ఎఐఆర్) 110ని సాధించిన ఎన్ చేతనరెడ్డి హాజరయ్యారని వెల్లడించింది. చేతన తన ఐచ్ఛిక అంశంగా సోషియాలజీని ఎంచుకున్నారు. తన నాలుగు ప్రయత్నాల ప్రయాణంలో స్థిరత్వం, స్వీయ క్రమశిక్షణ ద్వారా తుదకు లక్ష్యాన్ని చేరానని చేతన పేర్కొన్నారు. చేతన రెడ్డి సాధించిన విజయానికి తాము గర్వపడుతున్నామని విజన్ ఐఎఎస్ సౌత్ రీజియన్ బ్రాంచ్ హెడ్ కృష్ణ సింగ్ పేర్కొన్నారు.

అందాల పోటీలను రద్దు చేయాలి

- ఐద్వా, పిఒడబ్ల్యు నిరసన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అందాల పోటీలను వెంటనే రద్దు చేయాలని ఐద్వా, పిఒడబ్ల్యు డిమాండ్ చేశాయి. ఈ మేరకు మిస్ వరల్డ్ పోటీలు జరుగుతున్న గచ్చిబౌలి స్టేడియం ఎదుట ఆయా సంఘాల నేతలు శనివారం సాయంత్రం ఆందోళనకు దిగాయి. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, రాష్ట్ర సహాయ కార్యదర్శి కెఎన్ ఆశాలత, ఉపాధ్యక్షులు శశికళ, పిఒడబ్ల్యు నేత సంధ్య, ఝాన్సీ, ఐద్వా నాయకులు వినోద, వరలక్ష్మి, లక్ష్మమ్మ, సృజన, మంగ, కవిత, సంధ్య తదితరులు పాల్గొన్నారు. ఈ క్రమంలో వారిని పోలీసులు అరెస్టు చేసి మొయినాబాద్ స్టేషన్‌కు తరలించారు.

భద్రతా చర్యలు కట్టుదిట్టం

- అమల్లోకి సిటీ పోలీస్ యాక్ట్
- డ్రోన్లు, టపాసులపై నిషేధం
- ఆర్మీ కార్యకలాపాలపై ఫొటోలు, వీడియోలు షేర్ చేయొద్దు
- హైదరాబాద్ నగర సిపి సివి ఆనంద్

పోలీసులకు సూచనలు చేస్తున్న సిపి ఆనంద్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలో ప్రస్తుతం దాడుల వాతావరణం నెలకొన్న నేపథ్యంలో హైదరాబాద్ నగరంలో పోలీస్ అధికారులు మరింత అప్రమత్తమయ్యారు. భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేశారు. రాష్ట్రాలను కేంద్ర హోంశాఖ అప్రమత్తం చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నగర సివి ఆనంద్ కీలక నిర్ణయాలు వెల్లడించారు. సౌత్ జోన్, సౌత్ వెస్ట్, సౌత్ ఈస్ట్ జోన్లతోపాటు నగర పోలీస్ కమిషనరేట్ అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిల్లో ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. అత్యంత సమస్యాత్మక ప్రాంతాల్లో భారీగా పోలీసు బలగాలను మోహరించారు. పలు ప్రాంతాలల్లో ఆర్‌ఎఎఫ్ జవాన్లు, పోలీసులు మాక్ డ్రిల్ నిర్వహించారు. సెక్షన్ 67(సి) కింద తన అధికారాలను ఉపయోగించి హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల్లో హైదరాబాద్ సిటీ పోలీస్ యాక్ట్ అమలులోకి తీసుకొచ్చారు. ప్రజల భద్రత కోసం మిలటరీ కంటోన్మెంట్ ప్రాంతాలతోపాటు చుట్టుపక్కల బహిరంగ ప్రదేశాల్లో టపాసులు లేదా బాణసంచా పేల్చడం నిషేధం విధించారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు సమీపంలో డ్రోన్ల ఎగరవేతపై నిషేధం విధించారు. ప్రస్తుత భద్రతా వాతావరణం దృష్ట్యా, టపాసులు కాల్చినా పేలుడు లేదా తీవ్రవాద సంబంధిత కార్యకలాపాలని తప్పుగా అర్థం చేసుకునే అవకాశం ఉంటుంది. దాంతోపాటు పేలుడు శబ్దాలతో భద్రతా దళాలపై అనవసరమైన ఒత్తిడిని కలిగే అవకాశం ఉండటంతో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు సిపి తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో సభలు, సమావేశాలు, కార్యక్రమాల్లో టపాసులు పేల్చడం నిషేధమన్నారు. డ్రోన్స్ సైతం ఎగురవేయొద్దన్నారు. ఆర్మీఫోర్సు మూమెంట్స్, కార్యకలాపాలపై సోషల్ మీడియాలో వీడియోలు, ఫొటోలతోపాటు తప్పుడు వార్తలు షేర్ చేయొద్దని హెచ్చరించారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఆంక్షలు కొనసాగుతాయని సిపి స్పష్టం చేశారు. ఎక్కడైనా అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులను గమనిస్తే వారి కదలికలపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఎయిర్‌పోర్ట్ పరిధిలో డ్రోన్లు నిషేధం

భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ప్రమాదమూ జరుగకుండా నివారించడం, అందరి భద్రత కోసం డ్రోన్లను ఎగురవేయకుండా నిషేధం విధిస్తున్నట్టు సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మొహంతి ఒక ప్రకటనలో ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆర్డర్ వచ్చే నెల 9వ తేదీ వరకు అమలులో ఉంటుందని పేర్కొన్నారు.

ఎస్ఎఫ్ఐ నాయకులను విడుదల చేయాలి

భావన కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులను అక్రమంగా అరెస్టు చేసి పోలీసుస్టేషన్‌లో నిర్బంధించడం దుర్మార్గపు చర్య అని సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్ రజనీకాంత్, కార్యదర్శి టి నాగరాజు విమర్శించారు. అరెస్టు చేసిన ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రణయ్, శంకర్‌తోపాటు మిగిలిన నాయకులను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ఆత్మహత్యలపై విచారణ జరిపి ఆ కాలేజీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

జవాన్ మురళీనాయక్ తెలుగుజాతి గర్వించే యువకిశోరం

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా జమ్మూకాశ్మీర్‌లో అమరుడైన యువ జవాన్, అగ్నివీర్ మురళీనాయక్ తెలుగుజాతి గర్వించే యువకిశోరమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. దేశ రక్షణలో భాగంగా అత్యంత ధైర్య సాహసాలను ప్రదర్శించి ఐదుగురు ఉగ్రవాదులను మట్టుబెట్టి వీరమరణం పొందారని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మురళీ నాయక్ తల్లిదండ్రులకు సానుభూతిని వ్యక్తం చేశారు. భారతదేశాన్ని దొంగదెబ్బ తీస్తున్న ఉగ్రవాదులు, పాకిస్థాన్ ఉగ్రవాద శిబిరాలపై విరుచుకుపడుతున్న భారత సైన్యానికి ఆయన అభినందనలు తెలిపారు. దేశమంతా ఏకతాటిపై నిలిచి ఈ పోరాటం చేస్తున్న సైన్యానికి, కేంద్ర ప్రభుత్వానికి అండగా నిలబడుతున్నదని పేర్కొన్నారు. పార్టీలు, ప్రాంతాలు, మతాలకు అతీతంగా దేశభక్తి వెల్లివిరిసి, భిన్నత్వంలో ఏకత్వమనే నానుడిని ప్రజలు నిజం చేస్తున్నారని వివరించారు. ఇది భారతదేశ సమ్మిళితతత్వాన్ని మరోసారి ప్రపంచానికి చాటిందని తెలిపారు.

కాల్పుల విరమణను స్వాగతిస్తున్నాం

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారత్ ,పాకిస్తాన్ మధ్య తక్షణమే అమల్లోకి వచ్చిన కాల్పుల విరమణ ప్రకటన సానుకూలంగా ఉందనీ, దీన్ని సిపిఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ స్వాగతిస్తున్నదని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రెండు దేశాల ప్రజలు శాంతి కోసం చేసిన కృషిని అభినందిస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటికైనా పాకిస్తాన్ తన సరిహద్దుల్లో ఉగ్రవాద కార్యకలాపాలను అంతం చేయాలని కోరారు. ఇక నుండి ఎటువంటి ఘర్షణలు జరగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నేడే ఎప్‌సెట్ ఫలితాలు

- ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్న సిఎం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఎప్‌సెట్ పరీక్షల ఫలితాలను ఆదివారం ఉదయం 11 గంటలకు హైదరాబాద్ జూబ్లిహిల్స్‌లో ఉన్న తన నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విడుదల చేయనున్నారు. ఎప్‌సెట్ ఫలితాలతోపాటు అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం, ఇంజినీరింగ్ విభాగాల వారీగా అభ్యర్థులు సాధించిన మార్కులు, ర్యాంకులను ప్రకటిస్తారు. గతనెల 29,30 తేదీల్లో నిర్వహించిన ఎప్‌సెట్ అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం పరీక్షలకు 86,762 మంది అభ్యర్థులు దరఖాస్తు చేస్తే 81,198 (93.59 శాతం) మంది హాజరయ్యారు. ఈనెల రెండు, మూడు, నాలుగు తేదీల్లో ఎప్‌సెట్ ఇంజినీరింగ్ విభాగం పరీక్షలను నిర్వహించారు. ఈ విభాగానికి 2,20,117 మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా, 2,07,190 (94.04 శాతం) మంది అభ్యర్థులు హాజరయ్యారు. పరీక్షలు పూర్తయిన ఎనిమిది రోజుల్లోనే ఎప్‌సెట్ ఫలితాలు చేస్తుండడం గమనార్హం.

గురునానక్ కాలేజీలో విద్యార్థిని ఆత్మహత్య

- కుటుంబీకులు రాకముందే ఆస్పత్రికి మృతదేహం తరలింపు
- ఆందోళనకు దిగిన కుటుంబ సభ్యులు, ఎస్ఎఫ్ఐ
- ఇబ్రహీంపట్నంలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గురునానక్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థిని హాస్టల్‌లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. అయితే, కుటుంబీకులు రాకముందే మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించడంతో ఆందోళనకు దిగారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా తల్లాడ మండలం కురనవెల్లి గ్రామానికి చెందిన అల్లూరి భావన (22) ఇబ్రహీంపట్నం సమీపంలోని గురునానక్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నారు. అక్కడే హాస్టల్‌లో ఉంటున్నారు కాగా, శనివారం ఉదయం 10 గంటల సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని భావన ఆత్మహత్య చేసుకున్నారు. భావన మృతిపై కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. భావనది ఆత్మహత్య.. హత్యనా? అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు.

కుటుంబ సభ్యుల ఆందోళన

ఇంజినీరింగ్ కళాశాల ఎదుట భావన కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. మరోవైపు కుటుంబ సభ్యులు కళాశాలలోనికి వెళ్లకుండా యాజమాన్యం, పోలీసులు అడ్డుకున్నారు. దాంతో ప్రధాన గేటు వద్ద ఆందోళనలో దిగారు. తమకు ఎలాంటి సమాచారమూ ఇవ్వకుండా మృతదేహాన్ని తరలించడం పట్ల అనుమానాలు వ్యక్తం చేశారు. తమ కూతురిని కళాశాల యాజమాన్యమే హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తోందని ఆరోపించారు. తమను కళాశాల లోపలికి ఎందుకు రానివ్వడం లేదని ప్రశ్నించారు. పోలీసులు సమగ్ర విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

విద్యార్థి సంఘాల ఆందోళన

విద్యార్థి సంఘాల నాయకులు కాలేజీ ఎదుట ఆందోళన చేపట్టారు. బాధిత కుటుంబీకులకు మద్దతుగా ఎస్ఎఫ్ఐ, ఎంఎస్‌యూఐ, ఎబివిపి నాయకులు ఆందోళనకు దిగారు. కళాశాల యాజమాన్యం నుంచి ఎలాంటి స్పందనా లేకపోవడంతో వారు లోపలికి దూసుకెళ్లే యత్నం చేశారు. ఈ క్రమంలో ఇబ్రహీంపట్నం సిఐ జగదీశ్ విద్యార్థి సంఘాల నాయకులపై చేయి చేసుకున్నారు. దాంతో నాయకులు పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కుటుంబ సభ్యులకు చెప్పకుండానే విద్యార్థిని మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించడం ఏమిటని ప్రశ్నించారు. కళాశాల వద్ద కుటుంబ సభ్యులను అడ్డుకోవడం తగదని, విద్యార్థిని చనిపోయినా వార్షికోత్సవం చేసుకోవడం యాజమాన్యం దుర్మార్గపు చర్యలకు నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం నాయకులను పోలీసులు అరెస్టు చేసి ఆయా పోలీస్‌స్టేషన్లకు తరలించారు.

రేపు ఈసెట్ పరీక్ష

- 19,672 మంది దరఖాస్తు
- నిమిషం ఆలస్యమైనా అభ్యర్థులకు నో ఎంట్రీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో బీటెక్, బీఈ, బీ ఫార్మసీ, బీఎస్సీ మ్యాథమెటిక్స్ కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ద్వితీయ సంవత్సరంలో లాటరల్ ఎంట్రీ ద్వారా ప్రవేశాల కోసం నిర్వహించే ఈసెట్ రాతపరీక్ష సోమవారం ఆన్‌లైన్‌లో జరగనుంది. ఈ పరీక్ష నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ పరీక్షను నిర్వహిస్తారు. అదేరోజు ఉదయం 7.30 గంటల నుంచి పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులను అనుమతిస్తారు. ఉదయం తొమ్మిది గంటల వరకే అభ్యర్థులకు అనుమతి ఉంటుంది. ఆ తర్వాత నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించబోరు. బ్లాక్/బ్లూ బాల్ పాయింట్ పెన్ను, హాల్‌టికెట్, ఒరిజినల్ ఫొటో గుర్తింపు కార్డును అభ్యర్థులు తెచ్చుకోవాల్సి ఉంటుంది. క్యాలిక్యులేటర్లు, మ్యాథమెటికల్/లాగ్ టేబుల్స్, పేజర్లు, సెల్‌ఫోన్లు, డిజిటల్ వాచ్‌లు, పెద్ద కళ్లద్దాలు, ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లు, ఇతర పేపర్లను అనుమతి ఉండదు. హైదరాబాద్ పరిధిలో 46, ఇతర జిల్లాల్లో 40 కలిపి మొత్తం 86 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఈసెట్‌కు 19,672 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు.

అరుణోదయ 50 వసంతాల స్ఫూర్తి సభ : విమలక్క

హైదరాబాద్ బ్యూరో :'అరుణోదయ 50 వసంతాల స్ఫూర్తి సభ'ను సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నట్టు అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షులు విమలక్క తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. భూస్వామ్య-సామ్రాజ్యవాద సంస్కృతిని ఓడిస్తూ.. ప్రత్యామ్నాయ ప్రజాసంస్కృతి కోసం పోరాడుదామంటూ, మధ్య భారతంలో శాంతి నెలకొల్పాలని గళమిప్పుతూ ఈ సభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సినీ దర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ, రచయిత్రి చెన్నై మీనా కందస్వామి, అరుణోదయ నాగన్న, బుర్రా రమేష్, జనసాహితి అధ్యక్షులు దివికుమార్ హాజరవుతారని పేర్కొన్నారు.

సురవరంను పరామర్శించిన జానారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డిని శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియంపై పట్టు పెరగాలి

- మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న నర్సిరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 2021-2022 విద్యా సంవత్సరం నుంచి ఆంగ్ల మాధ్యమం ప్రారంభించినప్పటికీ ఆ వాతావరణం కనిపించడం లేదని మాజీ ఎమ్మెల్సీ, తెలంగాణ పౌర స్పందన వేదిక రాష్ట్ర అధ్యక్షులు అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని టిఎస్ యుటిఎఫ్ కార్యాలయంలో శనివారం కమ్యూనికేషన్ ఇంగ్లీష్‌పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం పరిస్థితులు కనిపించడంలేదని తల్లిదండ్రులు తెలియజేసినట్టు తెలంగాణ విద్యా కమిషన్‌లో పేర్కొన్నదని తెలిపారు. దీనిని అధిగమించేందుకు టిఎస్ యుటిఎఫ్, తెలంగాణ పౌర స్పందన వేదిక ఆధ్వర్యంలో ఈ శిక్షణా కార్యక్రమం పెట్టామని, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఆంగ్లంలో సులభంగా మాట్లాడటం, బోధించేందుకు ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని చేపట్టిన టిఎస్ యుటిఎఫ్ నల్లగొండ జిల్లా కమిటీని అభినందించారు. హైదరాబాద్ నుంచి వచ్చిన కమ్యూనికేటివ్ ఇంగ్లీష్ బోధకులు బికె.రెడ్డి మాట్లాడుతూ.. మైండ్ టాక్, సెల్ఫ్ టాక్, క్రాస్ టాక్ పద్ధతి ద్వారా ఇంగ్లీష్ భాషలో సులభంగా మాట్లాడొచ్చని, భాషను మైండ్‌కు అనుసంధానం చేయడం ద్వారా పట్టు సాధించొచ్చని తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.రాజశేఖర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ళ వెంకటేశం, ఉపాధ్యక్షులు నర్రా శేఖర్‌రెడ్డి, పౌర స్పందన వేదిక జిల్లా అధ్యక్షులు పాల్వాయి అంజిరెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు రెడ్ల సైదులు, కార్యదర్శులు గేర నర్సింహ, రమాదేవి, నలపరాజు వెంకన్న, మధుసూదన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు దివ్య సముఖమునకు, పిఠాపురం
F.D.I.A. No. 1/2024
O.S. No. 255/2016

Between:
వెలుగుల సూర్యనారాయణ
-పిటీషనరు/ వాది
మరియు
వెలుగుల వెంకటరత్నం (లేటు), వగైరా
-రెస్పాండెంట్లు/ ప్రతివాదులు

R-4: వెలుగుల అర్జునరావు, S/o. వెంకటరావు (లేటు), డో.నెం. 21-192/3, ఇస్లాంపూర్, మిర్యాలగూడ, మిర్యాలగూడ మండలం, నల్గొండ జిల్లా, తెలంగాణా స్టేట్.

పై నెంబరు కేసులో 4వ రెస్పాండెంటు అయిన మీకు కోర్టు వారు ఎన్నిమార్లు నోటీసులు పంపిన తీసుకొనక కాలయాపన చేసినందున మీకు నోటీసు ఈ పేపరు ప్రకటన ద్వారా ఇవ్వడమైనది. కావున మీరు **ది. 25-6-2025వ తేదీన ఉదయం 10.30 ని॥లకు** పై కోర్టులో హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియపరచుకోవలెను. లేనిచో మీ పరోక్షమున కోర్టు వారు తీర్పు ఇచ్చెదరు.

వాయిదా: 25-6-2025

టి.పి.ఆర్.చంద్రశేఖర్
అడ్వకేటు, కాకినాడ
సెల్: 9440337629

సీతారామ, సీతమ్మసాగర్ ప్రాజెక్టుల పూర్తికి ప్రణాళికలు

- 7.80 లక్షల ఎకరాలకు సాగునీరందించడమే లక్ష్యం : మంత్రి

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయనున్న సీతారామ ప్రాజెక్టు, సీతమ్మ సాగర్ మల్టిపర్పస్ ప్రాజెక్టుల పూర్తికి ప్రణాళికలు రూపొందించామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించారు. వీటిని పూర్తి చేయడం ద్వారా 7.80 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ సంకల్పమని వ్యాఖ్యానించారు. శనివారం నీటిపారుదల శాఖ కేంద్ర కార్యాలయం జలసౌధలో ఆ రెండు ప్రాజెక్టుల పురోగతిపై ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేల్, నీటిపారుదల శాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టుతోపాటు సీతమ్మసాగర్ అనుమతులు, పనుల పురోగతి, భూసేకరణ, సంబంధిత అంశాలపై ఇంజనీర్లు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం మంత్రి ఉత్తమ్ మీడియాతో మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టుకు గత ప్రభుత్వ హయాంలో నీటి కేటాయింపులు సాధించ లేకపోయిందని తెలిపారు. కేవలం 16 నెలల వ్యవధిలో కాంగ్రెస్ ప్రభుత్వం సిడబ్ల్యూసిని ఒప్పించి 67 టిఎంసిల నీటిని కేటాయించేలా ఒత్తిడి చేసినట్టు చెప్పారు. ప్రాజెక్టు పురోగతిపై ఆయన స్పందిస్తూ ఇప్పటికే మూడు పంపుహౌజ్‌ల నిర్మాణం పూర్తి కావడంతో పాటు నాలుగో పంపుహౌజ్ నిర్మాణదశలో ఉందన్నారు. మొత్తం 97 శాతం పనులు పూర్తయినట్టు వివరించారు. పాలేరు లింక్ కెనాల్, సత్తుపల్లి ట్రంక్ కెనాల్, ఎన్కూర్ లింక్ కెనాల్ పురోగతిలో ఉన్నాయని గుర్తు చేశారు. భూసేకరణను పూర్తి చేయడంతో పాటు టన్నెల్ నిర్మాణాలకు సంబంధించిన పర్యావరణ అనుమతులు త్వరితగతిన పొందేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్టు చెప్పారు. సీతమ్మ సాగర్ మల్టిపర్పస్ ప్రాజెక్టుకు అవసరమైన పర్యావరణ అనుమతులు వేగంగా తెచ్చి, పూర్తి చేసేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి కొన్ని పనులు అనుమతులు లేకుండానే చేపట్టిన కారణంగా జాతీయ హరిత ట్రిబ్యునల్(ఎన్‌జీటీ) విధించిన రూ. 53.41 కోట్ల జరిమానాను రద్దుచేసేందుకు చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇదే ప్రాజెక్టుకు అనుసంధానంగా నిర్మిస్తున్న 282.8 మేఘా వాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రానికి సంబంధించిన ప్రతిపాదనలు జెన్కోకు పంపించినట్టు తెలిపారు. దుమ్ముగూడెం-పాలేరు మెయిన్ కెనాల్ పూర్తికి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. గోదావరి జలాలతో ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందనీ, అందుకు సంబంధించిన ప్రణాళికలు రూపొందించుకుని పనుల్లో వేగం పెంచేందుకు అన్ని రకాల చర్యలు తీసుకున్నామన్నారు.

విద్యుత్ దాఘాతంతో తల్లీకూతురు మృతి

- జుక్కల్ మండలం పెద్దగుల్ల తండాలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇనుప కూలర్‌కు విద్యుత్ సరఫరా కావడంతో తల్లీకూతురు ప్రాణం కోల్పోయారు. ఈ విషాద ఘటన కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలంలోని పెద్దగుల్లా తండాలో శనివారం ఉదయం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన చౌహాన్ ప్రహ్లాద్- షంకబాయి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ప్రహ్లాద్ వృత్తిరీత్యా డ్రైవర్ కావడంలో వేరే పట్టణానికి వెళ్లాడు. పెద్ద కుమార్తె బంధువుల ఇంటికి వెళ్లారు. శుక్రవారం రాత్రి కొడుకు ఆరు బయట పడుకోగా, చిన్న కుమార్తె శ్రీవాని(12), షంకబాయి(36) ఇంట్లో ఇనుప కూలర్ వేసుకుని పడుకున్నారు. నిద్రమత్తులో శ్రీవాని ఎడమ కాలు కూలర్‌కు తగలడంతో విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతిచెందారు. ఆమె ద్వారా పక్కనే ఉన్న తల్లికి కూడా విద్యుత్ సరఫరా అయ్యి ప్రాణం కోల్పోయారు. ఆరు బయట పడుకున్న కొడుకు ప్రతిక్ ఉదయం లేచి లోపలికెళ్లేసరికే తల్లి, చెల్లెలు విగతజీవులుగా పడి ఉండటాన్ని గమనించాడు. వెంటనే చుట్టుపక్కల వారికి చెప్పగా.. వారు వచ్చి వెంటనే విద్యుత్ సరఫరాను నిలుపుదల చేశారు. విషయం తెలుసుకున్న బిచ్కుంద సీఐ నరేష్, జుక్కల్ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఈ ఘటనతో తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి. షంకబాయి భర్త చౌహాన్ ప్రహ్లాద్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను మద్నూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఎవరికీ పట్టని కూల్ రూఫ్ పాలసీ

- కూల్ పెయింట్ వేస్తే తగ్గనున్న 4 నుండి 16 డిగ్రీల ఉష్ణోగ్రతలు
- విద్యుత్ వినియోగం, ఛార్జీల భారం ఆదా
- కూల్ పెయింట్ వేయకున్నా ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ
- నిబంధనలు పట్టని మున్సిపల్ అధికారులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భవన సముదాయ నిర్మాణంలో కూల్ రూఫ్ పెయింట్ తప్పనిసరి. భవనాల నిర్మాణంలో ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ చేయాలంటే తప్పనిసరిగా భవనాలకు కూల్ పెయింట్ వేయాలి. కానీ..! కూల్ రూఫ్ పాలసీని ఎవరూ పట్టించుకోవడం లేదు. కూల్ పెయింట్ అంటే కేవలం చిన్నపాటి రేకుల షెడ్ల ఇళ్లు, దాబాల్లో నివశించే వాళ్లు మాత్రమే ఎండల తీవ్రత నుంచి ఉపశమనం కోసం వేసుకుంటారనే భావన ఉంది. దాని వల్ల చేకూరే ప్రయోజనాలు చాలానే ఉన్నాయి. పెద్ద పెద్ద వాణిజ్య, వ్యాపార సదుపాయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఇళ్లు, ఇతర భవనాలకు కూల్ పెయింట్ వేయడం ద్వారా గదుల లోపలి ఉష్ణోగ్రతల తీవ్రత తగ్గుతుంది. దాని వల్ల విద్యుత్ అధిక వినియోగం అవసరముండదు. విద్యుత్ చార్జీలూ తగ్గుతాయని అధికారులు చెబుతున్నారు. పర్యావరణం మెరుగుపడుతుందని కేంద్ర ప్రభుత్వ సంస్థ బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫీషియన్సీ (బీఈఈ) చేసిన పరిశోధనలో తేలింది. భవనాలపై కూల్ రూఫ్ పెయింట్ వేయడం ద్వారా చేకూరే లాభాల గురించి ఇటీవల శాస్త్రీయంగా రుజువైంది. కేంద్ర ప్రభుత్వ సంస్థ బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్స్ (బిఇఇ) సహకారంతో అడ్మినిస్ట్రేటివ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఎఎస్‌సీఐ) కూల్ రూఫ్ పెయింట్ వినియోగం, ఫలితాలపై క్షేత్రస్థాయి పరిశీలన చేసింది. హైదరాబాద్‌లోని హెచ్‌సియు భవనాలపై కూల్ రూఫ్ పెయింట్ వేసి పరిశీలించగా 4 నుంచి 16 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు తగ్గినట్టు తేలింది. నిర్ణీత భవన విస్తీర్ణంలో పెయింట్ వేయడం ద్వారా నమోదైన ఉష్ణోగ్రతలను బట్టి ఎంతో ప్రయోజనమున్నట్టు రుజువైంది.

కూల్ రూఫ్ పాలసీ

రాష్ట్ర వ్యాప్తంగా భవన సముదాయాలు విస్తరిస్తున్నాయి. బహుళ అంతస్తులు, భారీ భవనాలు, పెద్ద భవంతులతో కూడిన ఇళ్లు, ప్రభుత్వ కార్యాలయ భవన సముదాయాలు, వాణిజ్య భవనాల నిర్మాణం పెద్ద ఎత్తున జరుగుతోంది. అయితే, భవనాల నిర్మాణంలో పాటించాల్సిన అనేక నిబంధనల్లో కూల్ రూఫ్ పెయింట్ పాలసీ కూడా కీలకమైందే. ఈ నిబంధన గురించి భవన యజమానులు, అనుమతులిచ్చే మున్సిపల్ ఇతర శాఖల అధికారులు పట్టించుకోవడంలేదు. 2028 వరకు హైదరాబాద్‌లో 200 చదరపు కిలో మీటర్ల ప్రాంతంలోని భవనాలపై రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో 100 చదరపు కిలో మీటర్ల ప్రాంతంలో ఉన్న భవనాలపై కూల్ రూఫ్ పెయింట్ వేయించాలనేది లక్ష్యంగా నిర్దేశించారు. కొత్తగా నిర్మించే భవనాలతో పాటు పాత భవనాలపై కూడా కూల్ పెయింట్ వేయించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం భావించినా అమలు కావడం లేదు.

తగ్గనున్న విద్యుత్ వినియోగం

ప్రస్తుతం ఎండల తీవ్రత వల్ల హైదరాబాద్‌లోనే సాయంత్రం పూట 3794 మెగావాట్ల విద్యుత్ వినియోగం నమోదవుతున్నాయి. ఇతర ప్రాంతాల్లో కలిపితే మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగమవుతోంది. కూల్ రూఫ్ పెయింట్ వేయిస్తే లోపలి ఉష్ణోగ్రతలు తగ్గడం వల్ల సుమారు 500 మెగావాట్ల విద్యుత్‌ను పొదుపు చేయొచ్చని విద్యుత్ సంస్థలు పేర్కొంటున్నాయి.

పట్టించుకోని మున్సిపల్ అధికారులు

గృహ, వాణిజ్య, నివాసేతర భవనాల నిర్మాణం తర్వాత మున్సిపల్ అధికారులు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓఆర్) జారీ చేస్తారు. ఆ సమయంలో నిర్మించిన భవనాలపై కూల్ రూఫ్ పెయింట్ తప్పని సరిగా వేయాలి. ప్రతి ఆఫీస్ భవనం, నివాసేతర, వాణిజ్య భవనాలకు కూల్ రూఫ్ వేయించాలి. 600 చదరపు గజాల విస్తీర్ణంలో కట్టే భవనాలకు విధిగా కూల్ రూఫ్ వేయించాలి. తక్కువ విస్తీర్ణంలో నిర్మించే ఇండ్లకు పెయింట్ వేయిస్తే ఎంతో ఉపయోగం.

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE, VISAKAPATNAM DISTRICT AT :: YELLAMANCHILLI
I.A.NO. 209/2024 & I.A.NO. 210/2024 IN O.S.No. 17 OF 2024

BETWEEN:
1. Ashish Jain S/o. Late P.Ramesh Kumar Jain, A/a. 34 yrs, Occ: Business,
2. Akash Jain S/o. Late P.Ramesh Kumar Jain, A/a. 29 yrs, Occ: Business,
Both No.1 and 2 are R/o.H.No.12-1-334/17/18, Lalapet, Secunderabad, T.S-500017.
...Petitioners/Plaintiffs
AND
1. Mr. K.Sunder Babu S/o. Deva Danam, A/a. 56 yrs, Occ: Business, R/o. 12-1-334/17/2/1, Asian Hospital Lane, Lalapet, Hyderabad, T.S-500017.
2. Mr.K.Deva Kiran Kumar S/o. Late K.Dhanraj, A/a. 41 yrs, Occ: Railway Employee, R/o. H.No.12-1-334/19, Lalapet, Hyderabad, T.S-500017.
...Respondents/Defendants

Please take notice, In the above matter, petitioners/plaintiffs filed the Suit vide O.S.No.17/2024 on the file of Senior Civil Judge, Vishakapatnam District, At: Yellamanchilli for Recovery of money against the Defendants and along with 1.A.No.209/2024 and 1.A.No.210 / 2024 filed for attachment before judgement and impounding of the document respectively. The matter is posted on **18-06-2025** for the appearance of the Defendant No.1 and if any interested persons for calling the objections. Hence, this notice.

//BY ORDER OF COURT//

H.VANITHA JAIN
ADVOCATE
O/a.1st Floor, H.No.1-1-27/2, Raja Rajeshwari Nagar, Kapra, Madchal-Malkajgiri Dist. 500 062.
Cell : 9030330551/7897891005

నేషనల్ డిఫెన్స్ ఫండ్‌కి నెల జీతం విరాళం

- శాసన మండలి చైర్మన్, బిసి కమిషన్ చైర్మన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపు మేరకు తన నెల జీతం నేషనల్ డిఫెన్స్ ఫండ్‌కు ఇస్తున్నట్టు శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, బిసి కమిషన్ చైర్మన్ జి నిరంజన్ ప్రకటించారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం మీడియా సమావేశంలో గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడారు. శాసన మండలి సభ్యులు అందరూ నేషనల్ డిఫెన్స్ ఫండ్‌కు విరాళం ప్రకటించాలని కోరారు. పాకిస్థాన్‌తో భారత్ వీరోచిత పోరాటం చేస్తోందన్నారు. భారత్ యుద్ధ నీతిని పాటిస్తూ ఉగ్రవాదులు ఉన్న ప్రాంతాలపైనే దాడులు చేస్తుంటే.. పాకిస్థాన్ మాత్రం భారత్ పౌరులపై దాడి చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమయంలో పౌరులందరూ దేశానికి మద్దతుగా నిలబడాలని, వీర జవాన్ మురళి నాయక్ మృతి చాలా బాధాకరమని అన్నారు.

జింక మాంసం కొనుగోలు

- ముగ్గురి అరెస్ట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జింక మాంసాన్ని కొనుగోలు చేసిన ముగ్గురు నిందితులను హైదరాబాద్ వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్సు పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 3 కిలోల జింక మాంసం, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. శనివారం టాస్క్‌ఫోర్సు డిసిపి వైవిఎస్ సుదీంద్ర మీడియాకు వివరాలు వెల్లడించారు. టోలీచౌకీకి చెందిన హసన్ బక్రాన్, హమీద్ బిన్ హకానీ, షేక్ అబ్దుల్ రెహమాన్ స్నేహితులు. మహారాష్ట్రకు చెందిన రిజ్వాన్ నుంచి వీరు జింక మాంసాన్ని కొనుగోలు చేశారు. దానిలో కొంత విక్రయించారు. కొంత వండుకుని తిన్నారు. మిగిలిన మాంసాన్ని ఫొటోలు తీసి తోటి స్నేహితులకు షేర్ చేశారు. సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు ముగ్గురిని అరెస్టు చేశారు. సేకరించిన మాంసాన్ని ఫారెస్టు అధికారులకు అప్పగించారు. పరారీలో ఉన్న రిజ్వాన్ కోసం గాలిస్తున్నారు.

ఐఐటి సీట్లు పెంచండి

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి చనగాని దయాకర్ వినతి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్రానికి ఐఐటి సీట్లు పెంచాలనీ, కొత్త ఐఐటిను ఏర్పాటు చేయాలని టిపిసిసి అధికార ప్రతినిధి చనగాని దయాకర్ కోరారు. శనివారం ఈ మేరకు హైదరాబాద్‌లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ఆయన వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో 2008లో ఐఐటి ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. ఆ సంస్థ ప్రఖ్యాతి మరింత పెంచేందుకు, విద్యార్థులకు ఉన్నత అవకాశాలు కల్పించేందుకు, మరో 590 సీట్లను పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ఐఐటి సీట్లను పెంచడంతోపాటు ఐఐటి పునరుద్ధరణ, తిరుపతి, జమ్మూ కాశ్మీర్, పాలక్కాడ్, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక రాష్ట్రాల ఐఐటిల్లో సీట్లు పెంచేందుకు చర్యలు తీసుకోబోతున్నదని గుర్తు చేశారు. హైదరాబాద్ ఐఐటిని కూడా పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కాల్పుల విరమణ శుభపరిణామం

- మహేష్‌కుమార్‌గౌడ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

భారత్-పాక్ దేశాల కాల్పుల విరమణ శుభపరిణామమని టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్ అభిప్రాయపడ్డారు. రెండు దేశాల మధ్య కాల్పుల విరమణ హర్షణీయమని తెలిపారు. ఈ నెల 12న జరిగే ఇరు దేశాలు శాంతి చర్చలు విజయవంతం కావాలని ఆయన ఆకాంక్షించారు.

వడదెబ్బతో వృద్ధుడు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి గ్రామంలో శనివారం వడదెబ్బతో వృద్ధుడు మృతి చెందారు. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. చుక్కాపూర్ గ్రామానికి చెందిన దాసరి చుక్కయ్య (70) ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స పొంది, ఇంట్లోనే ఉంటున్నారు. శనివారం ఉదయం వ్యక్తిగత పనుల నిమిత్తం బయటకు వెళ్లడంతో ఎండ వేడిమికి కళ్లు తిరిగి కిందపడ్డారు. గమనించిన గ్రామస్తులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వెంటనే కుటుంబ సభ్యులు ఆయన్ను కల్వకుర్తి ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి, అప్పటికే మృతి చెందినట్టు తెలిపారు.

సన్నాల వైపే మొగ్గు

- వానాకాలంలో 1.34 కోట్ల ఎకరాల్లో సాగు
- గతేడాది కంటే నాలుగు లక్షల ఎకరాల్లో పెరిగే అవకాశం
- సాగు ప్రణాళికను రూపొందించిన వ్యవసాయ శాఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వచ్చే వానాకాలం సీజన్‌లో సన్న వడ్ల వైపే రైతులు మొగ్గుచూపే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ ప్రణాళిక అంచనా వేసింది. కోటీ 34 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతాయని తెలిపింది. గత వానాకాలం సీజన్‌తో పోలిస్తే ఈ సారి సాగు విస్తీర్ణం సుమారు నాలుగు లక్షల ఎకరాలకు పైగా పెరిగే అవకాశం ఉన్నట్లు అంచనా. అందులో అత్యధికంగా 66.80 లక్షల ఎకరాల్లో వరి, 50 లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతాయని పేర్కొంది. ఈ మేరకు వానాకాలం సీజన్ సాగు ప్రణాళికను సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపింది. పౌరసరఫరాల శాఖ పేదలకు సన్న బియ్యం పంపిణీ చేయడం, క్వింటాల్‌కు రూ. 500 బోనస్ ఇవ్వడంతో సన్నాలకు గిరాకీ పెరగనుంది. అంతేకాకుండా సన్నాలకు మద్దతు ధర ఇచ్చి ప్రభుత్వమే కొనుగోలు చేయడంతో కలిసొచ్చే అంశంగా కనిపిస్తున్నది. సన్నాల సాగు 60 నుంచి 70 శాతానికి పైగా ఉండొచ్చని ప్రభుత్వం చెబుతోంది. గత సంవత్సరం వానాకాలం సీజన్‌లో 65.49 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా, అందులో 30 శాతం వరకు సన్న రకాల వరినే సాగు చేశారు. రాష్ట్రంలో వరి తర్వాత పత్తి సాగు రెండో స్థానం ఉంటుంది. ఈసారి పత్తి సాగు విస్తీర్ణం కూడా పెరగనున్నట్టు అంచనా వేసింది. కూరగాయలు, ఇతర ఉద్యానవన పంటలు కలిపి పది లక్షల ఎకరాల వరకు ఉండొచ్చని వ్యవసాయ శాఖ భావిస్తోంది. ఈ ప్రణాళికకు అనుగుణంగా విత్తనాలు, ఎరువులను వ్యవసాయ శాఖ సిద్ధం చేసినట్టు తెలిసింది.

పత్తి 50 లక్షల ఎకరాల్లో సాగు

తెలంగాణ పత్తికి అంతర్జాతీయ మార్కెట్లో మంచి గిరాకీ ఉండటంతో రైతులు కూడా పత్తి సాగు చేస్తున్నారు. పత్తికి మద్దతు ధర లభించడం, పెరుగుతున్న డిమాండ్‌తో రాష్ట్రంలో గత వానాకాలంలో 43.76 లక్షల ఎకరాల్లో పత్తి సాగైనట్టు వ్యవసాయ శాఖ చెబుతున్నది. అది ఈసారి 50 లక్షల ఎకరాలకు చేరుకోనుంది. గతేడాది ఎక్కువ మంది రైతులు పత్తికి బదులు వరి, ఇతర పంటల వైపు దృష్టి పెట్టడంతో పత్తి పంట విస్తీర్ణం తగ్గింది. అయితే పంట దిగుబడి వచ్చిన తర్వాత సిసిఐ రైతుల నుంచి క్వింటాలు పంటకు రూ.7,521 మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేసింది. కొన్ని చోట్ల ప్రయివేటు వ్యాపారులు కూడా సరసమైన ధరకు కొన్నారు. పత్తి రైతుకు లాభం తగ్గినప్పటికీ, విదేశీ మార్కెట్లో కూడా పత్తికి డిమాండ్ ఉండడంతో వానాకాలంలో రైతులు తెల్ల బంగారం వైపు మొగ్గు చూపే అవకాశం ఉన్నది.

నాణ్యమైన విత్తనం ద్వారా అధిక దిగుబడి

నాణ్యమైన విత్తనం ద్వారానే అధిక పంటల దిగుబడి వస్తోందని వ్యవసాయ శాఖ భావిస్తోంది. ఏ పంట ఎంత విస్తీర్ణంలో సాగవుతుంది. అందుకు ఎన్ని క్వింటాళ్ల విత్తనాలు కావాలి. అనే విషయాన్ని కూడా వ్యవసాయ సాగు ప్రణాళిక పేర్కొంది. రాష్ట్రంలో వచ్చే వానాకాలం 68.80 ఎకరాల వరి సాగుకు 16.70 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అవసరమని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. అయితే మార్కెట్‌లో 75 లక్షల ఎకరాలకు సరిపడిన విత్తనాలను అందుబాటులో ఉంచినట్టు పేర్కొంది.వాటిలో తెలంగాణ సీడ్స్ కార్పొరేషన్ 17,790 క్వింటాళ్ల విత్తనాలను సిద్ధంగా ఉంచినట్టు తెలిపింది. నేషనల్ సీడ్ కార్పొరేషన్ 9,500 క్వింటాళ్లను సిద్ధం చేసింది. ఇక ప్రయివేటు సంస్థలు 18.52 లక్షల క్వింటాళ్ల వరి విత్తనాలను ఇప్పటికే సిద్ధంగా ఉంచాయి. పత్తి 50 లక్షల ఎకరాల్లో సాగు చేస్తే అందుకవసరమయ్యే 45 వేల క్వింటాళ్ల విత్తనాలకు గాను ప్రయివేటు పత్తి సీడ్ కంపెనీలు ఏకంగా 1.34 లక్షల క్వింటాళ్ల బీటీ పత్తి విత్తనాలను సిద్ధంగా ఉంచాయి. మొక్కజొన్న ఆరు లక్షల ఎకరాల్లో సాగైతే, అందుకు 48వేల క్వింటాళ్ల విత్తనాలు అవసరమవుతాయని వ్యవసాయ శాఖ తేల్చింది. ఇవి కాకుండా కందులు, పెసలు, మినుములు, జొన్నలు, వేరుశనగ, ఆముదం, నువ్వులు తదితర వంటల విత్తన ప్రణాళికను ప్రభుత్వం సిద్ధం చేసింది.

నకిలీ విత్తన సరఫరాదారులపై కొరడా

ప్రతి ఏటా రైతులు నకిలీ విత్తనాలతో నాలుగైదు లక్షల ఎకరాల్లో పంట నష్టపోతున్నారు. వీటిలో జర్మినేషన్ 60 శాతంలోపే ఉంటుంది. గతంలో విత్తన ధ్రువీకరణ పత్రాలు వ్యవసాయ విశ్వవిద్యాలయం ఇచ్చేది. కానీ ఇటీవల ప్రయివేటు సంస్థలకు అప్పగించారు. దీంతో ఆయా కంపెనీలు విత్తనాలను అమ్ముకునేందుకు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో నకిలీ విత్తన సరఫరాదారులపై ముందస్తుగా కఠిన చర్యలు తీసుకోవాలని భావిస్తోంది.

ఔటర్‌పై ఘోర ప్రమాదం

- ఇద్దరు సజీవ దహనం.. ఆస్పత్రిలో మరొకరు మృతి
- ఆగి ఉన్న బొలెరోను ఢీకొట్టిన కారు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మంటల్లో చిక్కుకున్న కారు

ఔటర్ రింగ్‌రోడ్డుపై శనివారం తెల్లవారు జామున ఘోర ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న బొలెరో వాహనాన్ని ఓ కారు ఢీకొట్టడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. కారులో ఉన్న ముగ్గురిలో ఇద్దరు సజీవ దహనమయ్యారు. మరొకరు ఆస్పత్రిలో మృతిచెందారు. ఈ ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...రంగారెడ్డి జిల్లా కందుకూరు ప్రాంతం నుంచి బొలెరో వాహనం మామిడికాయల లోడుతో తుక్కుగూడ ఎగ్జిట్ నెంబర్ 14 ఓఆర్ఆర్‌పై నుంచి అబ్దుల్లాపూర్‌మెట్ బాటసింగారం పండ్ల మార్కెట్‌కు వస్తుండగా గండి చెరువు బ్రిడ్జి సమీపంలో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దాంతో మామిడి కాయలు కింద పడిపోయాయి. అటుగా వచ్చిన వాహనదారులు గమనించి వాహనాలను రోడ్డు పక్కన ఆపి.. మామిడి కాయలు ఎత్తడానికి సహాయం చేస్తున్నారు. అదే సమయంలో తాడ్బన్ బహదురుపురకు చెందిన దీపేష్ అగర్వాల్ తన స్నేహితులు సంచయ్ మల్పని, ప్రియాన్స్ మిటల్‌తో కలిసి తెల్లవారు జామున శంషాబాద్ నుంచి ఘట్కేసర్‌కు టాటా కర్వ్ కారులో వెళ్తున్నారు. బ్రిడ్జి వద్ద ఆగి ఉన్న బొలెరోను ఢీకొట్టారు. దాంతో ఒక్కసారిగా కారులో మంటలు చెలరేగడంతో దీపేష్ అగర్వాల్, సంచయ్ మల్పని అక్కడికక్కడే మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన ప్రియాన్స్ మిటల్‌ను ఎల్బీనగర్‌లోని కామినేని ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందారు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని ఫైరింజన్‌తో మంటలను ఆర్పేశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కులాంతర వివాహ జంటపై దాడి

- అడ్డొచ్చిన యువకుని తల్లికి కత్తిపోట్లు
- భూపాలపల్లి జిల్లాలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రేమించుకుని కులాంతర వివాహం చేసుకున్న జంటపై యువతి సోదరుడు కత్తితో దాడికి యత్నించాడు. ఆ సమయంలో అడ్డుకోబోయిన యువకుని తల్లిని పొడిచాడు. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలోని చెల్పూర్ గ్రామంలో శనివారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చెల్పూర్ గ్రామానికి చెందిన బాషబోయిన రాజయ్య కూతురు జ్యోతి (ముదిరాజ్ సామాజిక తరగతి), అదే గ్రామానికి చెందిన కౌటం ప్రశాంత్ (మున్నూరు కాపు)ను ఐదు నెలల కిందట ప్రేమ వివాహం చేసుకున్నారు. వారిద్దరూ ఇటీవల స్వగ్రామానికి వచ్చి ప్రశాంత్ ఇంట్లో ఉంటున్నారు. కాగా, వారి ప్రేమ వివాహాన్ని ఒప్పుకోని జ్యోతి సోదరుడు సాయి శనివారం రాత్రి వారింటికెళ్లి ఆమెపై, ప్రశాంత్‌పై కత్తితో దాడి చేసే క్రమంలో ప్రశాంత్ తల్లి లక్ష్మి అడ్డు వచ్చింది. దీంతో ఆమె కత్తిపోట్లకు గురికావడంతో వెంటనే స్థానికులు భూపాలపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లేబర్ కోడ్లను రద్దు చేయాలి

- భవన నిర్మాణ, వలస కార్మికుల చట్టాలను పునరుద్ధరించాలి
- భవన నిర్మాణ కార్మిక సంఘాల సదస్సులో వక్తలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సదస్సులో మాట్లాడుతున్న సిడబ్ల్యుఎఫ్ఐ జాతీయ ఉపాధ్యక్షులు ఎం.సాయిబాబు

కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలి.. భవన నిర్మాణ కార్మికుల కేంద్ర చట్టం-1996, వలస కార్మికుల చట్టం - 1979ను పునరుద్ధరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘాల సదస్సులో పలువురు వక్తలు పిలుపునిచ్చారు. మే 20న చేపడుతున్న దేశవ్యాప్త సమ్మెకు సిద్ధం కావాలని కోరారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎఐటియుసి, సిఐటియు, బిఆర్‌టియు, టియుసిఐ, ఐఎఫ్‌టియు, బిఎస్ఆర్‌కెఎస్, ఎస్‌ఎస్ఆర్కేఎస్ ఆధ్వర్యంలో శనివారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిడబ్ల్యుఎఫ్ఐ జాతీయ ఉపాధ్యక్షులు ఎం.సాయిబాబు మాట్లాడుతూ.. కార్మికుల పోరాటాల ఫలితంగా 29 కార్మిక చట్టాలను సాధించుకున్నారని వివరించారు. బిజెపి అధికారంలోకొచ్చాక ఈ చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకొచ్చిందని తెలిపారు. కార్మికవర్గానికి గొడ్డలిపెట్టు వంటి నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీని నియమించి కార్మికుల సంక్షేమం కోసమే నిధులు ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. బిజెపి ప్రభుత్వం లేబర్ కోడ్లను 2019-20లో పార్లమెంట్‌లో ఆమోదింపజేసుకుందని, కానీ కార్మికవర్గం నుంచి బలమైన ప్రతిఘటన ఎదురైన కారణంగా కోడ్లు అమలు చేయలేదని చెప్పారు. ఇప్పటి వరకు నిర్మాణాల పనుల వద్ద ప్రమాదాల్లో గాయపడినా, మరణించినా నష్టపరిహారాలు అందుతున్నాయని అన్నారు. కానీ, లేబర్ కోడ్లు అమలైతే 12 అడుగుల ఎత్తు లోపు నిర్మాణాల వద్ద, భవనాల్లో మరమ్మతులు, మార్పులు, చేర్పుల పనులకు, చమురు, గ్యాస్ సంస్థల నిర్మాణాల్లో పనిచేసే కార్మికులకు ఈ చట్టం వర్తించదని అన్నారు. సెస్ నిధుల వసూళ్లలో మార్పులు చేస్తూ యజమాని చెప్పిన విధంగానే వసూలు చేయాలని, అది కూడా రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షల పైబడిన నిర్మాణాల నుండే వసూలు చేయాలని మార్పు చేశారని, 10 మందికి పైన పనిచేసే చోట మాత్రమే చట్టం వర్తిస్తుందని పెట్టారని తెలిపారు. అందవల్ల చట్టాల రక్షణకు మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఎఐసిబిసిడబ్ల్యు డిప్యూటీ సెక్రటరీ ఎం.ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. కార్పొరేట్లకు లక్షల కోట్ల రాయితీలిచ్చి, ప్రజల మౌలిక ఆస్తులైన రైల్వే, రోడ్లు, రక్షణ, విమానాశ్రయాలు, టెలికాం రంగాలను ప్రయివేట్ సంస్థలకు అప్పజెప్పుతోందన్నారు. భవన నిర్మాణ రంగంలో 100శాతం విదేశీ పెట్టుబడులను ఆహ్వానించి విచ్చలవిడిగా యంత్రాల వాడకానికి అనుమతిచ్చారని, నిర్మాణాల్లో వాడే ముడి సరుకుల ధరలు పెరిగి సామాన్యుల ఇండ్ల నిర్మాణాలు తగ్గిపోయాయన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు ఆర్.కోటంరాజు మాట్లాడుతూ.. రాష్ట్ర వెల్ఫేర్ బోర్డులో 26 లక్షల 50 వేల మంది కార్మికుల పేర్లు నమోదయ్యాయని, 15 లక్షల మంది కార్మికులే లైవ్‌లో ఉన్నారని అన్నారు. రూ.6,000 కోట్ల సెస్ వసూలైతే కార్మికులకు ఇచ్చింది రూ.1,500 కోట్లు మాత్రమేనన్నారు. ఈ సదస్సులో ఆయా సంఘాల నేతలు పి.నారాయణ, అన్మేష్, అనురాధ, కామెల్ల ఐలన్న, ఎస్.కుమార్, ఆరెల్లి కృష్ణ, వంగూరు రాములు, జి.రమేష్, లక్ష్మీనారాయణ, కె.జంగయ్య, ఎల్క సోమయ్య, ముదాం శ్రీనివాస్, టి.లక్ష్మయ్య, గాలన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్

ఢిల్లీ తెలంగాణ భవన్‌లో విద్యార్థులకు బస

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

దేశ సరిహద్దుల్లో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఆయా రాష్ట్రాల్లో చదువుకుంటున్న తెలుగు విద్యార్థులను న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్ ఆదరించింది. శనివారం తెల్లవారుజామున పంజాబ్‌కు చెందిన జలందర్‌లోని లవ్‌లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీతోపాటూ జమ్మూకు చెందిన కొంత మంది విద్యార్థులు తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్‌ను కలిసి తమ పరిస్థితిని చెప్పుకున్నారు. విద్యార్థుల గురించి ఆరా తీసిన కమిషనర్ వెంటనే తెలంగాణ భవన్‌లో బస ఏర్పాటు చేశారు. భోజనం సదుపాయం సైతం అందుబాటులోకి తెచ్చారు. అనంతరం రవాణా సౌకర్యాన్ని కల్పించారు. ఆందోళన చెందాల్సిన అవసరం లేదనీ, మీ బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని భరోసానిచ్చారు. సిఎం రేవంత్ ఆదేశాల మేరకు రెసిడెంట్ కమిషనర్ విద్యార్థులకు అన్నీ సదుపాయాలను ఏర్పాటు చేశారు.

మానవాళికి శత్రువు ఉగ్రవాదం

- సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మానవాళికి ప్రధాన శత్రువు ఉగ్రవాదం అని సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ అన్నారు. అది ఏ మతంలో ఉన్నా, ఏ కులంలో ఉన్నా, ఏ ప్రాంతంలో ఉన్నా దానిని సమూలంగా నిర్మూలించాల్సిందేనని చెప్పారు. శనివారం హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఆడపిల్ల కన్నీరు వృధా పోదనీ, ఆపరేషన్ సిందూర్ పేరుతో భారత సైన్యం పక్కా ప్రణాళికతో పాకిస్తాన్ కేంద్రంగా కరుడుగట్టిన ఉగ్రవాదుల స్థావరాలపైనే దాడులు చేసి ధ్వంసం చేయడం ద్వారా భారత్ శక్తిని సైనికులు ప్రపంచానికి చాటారని వివరించారు. సరిహద్దులో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అగ్నివీర్ మురళి నాయక్ మరణం సంతాపం, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఉగ్రవాదులు ఏ మూలన ఉన్నా మట్టు పెట్టాల్సిందేనని అన్నారు. ఉగ్రవాదుల స్థావరాలపై దాడి క్రమంలో పాకిస్తాన్ సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలిగించొద్దన్నదే తన అభిప్రాయమని చెప్పారు. అంతర్జాతీయ ఉగ్రవాది మసూద్ అజార్‌ను భారత్‌కు రప్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న కులగణనను స్వాగతిస్తున్నామని చెప్పారు. ఈ ప్రక్రియను నిర్దిష్ట కాలపరిమితిలోగా పూర్తి చేయాలని కోరారు. 2029లో జరిగే సార్వత్రిక ఎన్నికల నాటికి కుల గణన ప్రక్రియను పూర్తి చేసి చట్ట సభల్లో బీసీలకు రిజర్వేషన్లను కల్పించాలని సూచించారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచ సుందరి పోటీలను హైదరాబాద్‌లో నిర్వహించడం సిగ్గుచేటని విమర్శించారు. మహిళల అందాల పోటీల పేరుతో వ్యాపారం చేస్తారా?అని ప్రశ్నించారు.

భారత ఆర్మీకి సెల్యూట్ : అజీజ్ పాషా

పాకిస్తాన్‌లోని పలు ప్రాంతాల్లో భారత్ దాడులకు పాల్పడిందని సిపిఐ జాతీయ కార్యదర్శి అజీజ్‌పాషా అన్నారు. పాకిస్తాన్ సుమారు 400 డ్రోన్లను ప్రయోగించగా, వాటిని భారత సైన్యాలు విజయవంతంగా తిప్పికొట్టడం అభినందనీయమని చెప్పారు. సాధారణ పౌరులకు ఎలాంటి ప్రాణ నష్టం జరగకూడదనే లక్ష్యంతో భారత సైన్యాలు అర్ధరాత్రి తర్వాత కేవలం ఉగ్రవాదుల స్థావరాలను మాత్రమే లక్ష్యంగా చేసుకుని దాడులు చేశారనీ, విజయవంతం చేయడం పట్ల ప్రపంచ దేశాలు హర్షించాయని అన్నారు. భారత ఆర్మీకి సెల్యూట్ చేస్తున్నానని అన్నారు. కసబ్ లాంటి ఉగ్రవాదులు శిక్షణ పొందిన లష్కర్ ఏ తోయిబా, జైషే మహ్మద్, హిజ్బుల్ ముజాహిద్దీన్ అనే ప్రధానమైన ఉగ్రవాద సంస్థల కేంద్రాల్లోకి భారత సైన్యం వెళ్లి ధ్వంసం భారత సైనిక శక్తికి నిదర్శనమన్నారు. పాకిస్తాన్ ఏకాకి అయ్యిందనీ, కేవలం టర్కీ మాత్రమే మద్దతుగా నిలిచిందని చెప్పారు.

ఎంజి విండ్సర్ ప్రో కారును ప్రారంభిస్తున్న అనురాగ్ మెహరోత్రా

హైదరాబాద్‌లో ఎంజి విండ్సర్ ప్రో ఆవిష్కరణ

ప్రజాశక్తి - హైదరాబాద్

జెఎస్‌డబ్ల్యు ఎంజి మోటార్ ఇండియా తన ఎంజి విండ్సర్ ప్రో కారును హైదరాబాద్ ఎల్‌బినగర్‌లోని పిపిఎస్ మోటార్స్ ఎంజి షోరూంలో ఆవిష్కరించింది. దీని ప్రారంభ ధరను రూ.12.49 లక్షలుగా నిర్ణయించామని ఆ కంపెనీ మేనేజింగ్ భాగస్వామి అనురాగ్ మెహరోత్రా తెలిపారు. ఒక్క సారి ఛార్జింగ్‌తో 449 కిలోమీటర్లు ప్రయాణిస్తుందన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి

ఉగ్రవాద మతతత్వ కుట్రలను తిప్పికొట్టాలి : జూలకంటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉగ్రవాద మతతత్వ కుట్రలను తిప్పికొట్టాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణ కేంద్రంలోని సిపిఎం కార్యాలయంలో ఆయన శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇండో-పాక్ యుద్ధం వల్ల ఇరుదేశాలకు నష్టం వాటిల్లుతుందని అన్నారు. ఉగ్రవాదులు విచక్షణారహితంగా కాల్పులు జరిపి 28 మంది టూరిస్టులను పొట్టనబెట్టుకోవడం భారతీయులందరినీ కలిచివేసిందని, ఇది దుర్మార్గ చర్య అన్నారు. అందుకు పాకిస్థాన్ కనీసం పశ్చాత్తాపం ప్రకటించకపోవడం, కాల్పుల ఘటనకు బాధ్యులైన ఉగ్రవాదులను ఇండియాకు అప్పగిస్తామని చెప్పకపోవడంతో భారత్ అనివార్యంగా ప్రతీకారచర్యలకు దిగిందన్నారు. యుద్ధంలో మరణించిన వీర జవాన్లకు, ప్రజలకు నివాళులు అర్పిస్తున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, రవి నాయక్, మల్లు గౌతంరెడ్డి, తదితరులు ఉన్నారు.

అడ్మిషన్ల వేట

- ప్రవేశాల టార్గెట్లు.. టీచర్లపై యాజమాన్యాల కత్తి
- లక్ష్యాలు విధించి.. వీధుల్లో ప్రచారం
- వేతన చెల్లింపులనకు కొలమానం
- పక్షం రోజులుగా ప్రవేశాల వేటలో ప్రయివేటు బడులు, కాలేజీలు
- తీవ్ర మనోవేదనలో ఉపాధ్యాయ, అధ్యాపకులు
- ఇంటింటికీ యాచన చేయడం కష్టంగా ఉందంటూ ఆవేదన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వచ్చే విద్యా సంవత్సరం కోసం ప్రయివేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు అడ్మిషన్ల వేట ప్రారంభించాయి. ప్రయివేటు పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు ఉపాధ్యాయులు, అధ్యాపకులకు టార్గెట్లు విధించి వీధుల్లో ప్రచారానికి దింపాయి. ఇది ఎన్నికల ప్రచారాన్ని తలపిస్తోంది. ఉపాధ్యాయులను ఇంటింటికీ పంపుతూ తమ పాఠశాలల్లో ఉన్న సౌకర్యాలను వివరిస్తున్నారు. మొదటి తరగతి నుంచే ఇంగ్లీష్ మీడియం, డిజిటల్ క్లాసులు, క్రీడా సౌకర్యాలు ఉన్నాయని ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. గత విద్యా సంవత్సరంలో తమ పాఠశాల విద్యార్థులు సాధించిన మార్కులను చూపిస్తూ, టాపర్లు తమ నుండే ఉన్నారని గొప్పగా చెప్పుకుంటున్నారు. హైదరాబాద్, కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం తదితర పట్టణాల్లో ఎక్కడ చూసినా ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆయా విద్యాసంస్థల తరపున కరపత్రాలు పంచుతూ విద్యార్థుల పేర్లు రాసుకుంటున్నారు.

ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా యాజమాన్యాలు ఉపాధ్యాయులపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నాయి. చాలా పాఠశాలల్లో టీచర్లకు అడ్మిషన్ల టార్గెట్లు విధించాయి. ఈ టార్గెట్‌లను పూర్తి చేస్తేనే ఇంక్రిమెంట్లు ఉంటాయని షరతులు విధిస్తున్నాయి. దీంతో తీవ్ర ఎండలోనూ ఉపాధ్యాయులు కాలనీల వెంట తిరుగుతూ విద్యార్థులను చేర్పించాలని వేడుకుంటున్నారు. మరికొన్ని పాఠశాలల్లో అడ్మిషన్లపై కమీషన్ ఇస్తూ ఉపాధ్యాయులను ప్రచారంలోకి దించుతున్నారు. ఈ క్రమంలో పాఠశాలల సిబ్బంది కాలనీల్లో సేకరించిన సమాచారంతో విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్లు చేసి, అడ్మిషన్ల గురించి ఒత్తిడి చేస్తున్నారు. ఫీజుల విషయంలో మాట్లాడేందుకు ప్రత్యేకంగా పీఆర్‌ఓలను నియమించుకుంటున్నారు. కొత్తగా వివిధ పేర్లతో వస్తున్న విద్యాసంస్థలతో బడ్జెట్ స్కూల్స్ పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. గ్లోబల్ వరల్డ్, ఇంటర్నేషనల్ స్కూల్స్‌తో చిన్న చిన్న స్కూల్స్‌కు ఇబ్బందిగా పరిణమించింది.

ప్రయివేటు కాలేజీల్లోనూ ఇదే పరిస్థితి..

ప్రయివేటు కళాశాలల పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా లేదు. టెన్త్ ఫలితాలు రాకముందు నుంచే ప్రయివేటు స్కూళ్ల వద్ద విద్యార్థుల తల్లిదండ్రుల కాంటాక్ట్ నంబర్లు సేకరించి ఫోన్లు చేస్తున్నారు. తమ కళాశాలలోని సౌకర్యాలు, ర్యాంకుల గురించి బల్క్ మెసేజ్‌లు పంపుతూ విద్యార్థులను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. టెన్త్ ఫలితాలు విడుదలైననాటి నుంచి ప్రచారాన్ని మరింత ముమ్మరం చేశారు. చట్ట ప్రకారం ఇలాంటి ప్రచారాలు చేస్తే చర్యలు తీసుకుంటామని విద్యాశాఖ అధికారులు చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం పట్టించుకోవడం లేదు.

టార్గెట్ రీచ్ అయితేనే జీతం పెంపు

కొన్ని కార్పొరేట్ పాఠశాలలు అయితే అడ్మిషన్ల టార్గెట్ పూర్తి చేస్తేనే వేసవి సెలవుల్లో జీతం ఇస్తామని నిబంధనలు పెట్టాయి. ఒక్కో ఉపాధ్యాయుడు కనీసం 10 నుంచి 15 మంది విద్యార్థులను చేర్పించాలని ఆదేశాలు జారీ చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు ప్రచారంలో తిరుగుతున్న ఉపాధ్యాయులు.. అడ్మిషన్లు చేయకపోతే ఉద్యోగం పోతుందనే భయంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. చాలీచాలని జీతాలతో, పని ఒత్తిడితో ప్రయివేట్ ఉపాధ్యాయుల జీవితాలు దుర్భరంగా మారుతున్నాయి.

పలువురు ఉపాధ్యాయుల ఆవేదన ఇదీ..

'సార్ నమస్తే అంటూ ప్రతి ఇంటి తలుపు తట్టాలంటే చాలా ఇబ్బందిగా ఉంది. మేం టీచర్లం కదా.. ఇలా యాచన చేసేలా తిరగడం ఎంత బాధాకరమో చెప్పలేను. మా కష్టాలు ఎవరికీ అర్థం కావు. టార్గెట్ పూర్తి చేయకపోతే జీతం కట్ చేస్తామంటున్నారు. పిల్లల్ని ఎలా చేర్పించాలో అర్థం కావడం లేదు.'

రాధిక, ప్రయివేటు పాఠశాల ఉపాధ్యాయురాలు

'మాకు బోధనే ప్రధానం. కానీ ఇప్పుడు అడ్మిషన్లు తేవడమే ముఖ్యమైన పనిగా మారింది. టెన్త్ రిజల్ట్స్ రాక ముందు నుంచే విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్లు చేసి మాట్లాడుతున్నాం. మా కాలేజీలో చేరితే మంచి భవిష్యత్ ఉంటుందని చెప్పాల్సి వస్తోంది. ఇది మాకు అసౌకర్యంగా ఉంది కానీ తప్పదు.'

- సురేష్, ప్రయివేటు కళాశాల అధ్యాపకులు

'ఇక్కడ టార్గెట్ చాలా ఎక్కువగా పెట్టారు. కనీసం పది మంది పిల్లలనైనా చేర్పించాలంటున్నారు. వేసవి సెలవుల్లో కూడా మాకు విశ్రాంతి లేదు. రోజంతా తిరిగినా ఒక్క అడ్మిషన్ కూడా రావడం లేదు. ఉద్యోగం ఉంటుందో పోతుందో తెలియక భయంగా ఉంది. కుటుంబం ఎలా గడుస్తుందో అని దిగులుగా ఉంది.'

- లక్ష్మి, కార్పొరేట్ పాఠశాల ఉపాధ్యాయురాలు